క్లుప్తంగా

సవిస్కార-2కె25లో విద్యార్థుల ప్రతిభ



సవిస్కార - 2కె25లో ప్రతిభ చూపిన ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ విద్యార్థులు

కాకినాడ రూరల్: నన్నయ యూనివర్సిటీలో నిర్వహించిన సవిస్కార-2కె25 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను స్థానిక అచ్చంపేట జంక్షన్‌లోని నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం విద్యార్థులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ అభినందించారు. 12 విభిన్న విభాగాలల్లో విద్యార్థులు ప్రతిభ చూపేందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఆ విభాగాధిపతి అజయ్‌రత్నం, అధ్యాపకులు శ్రీరామరాజు, మధుకుమార్, మణికంఠేశ్వరరెడ్డి, మనోజ్ దేవ, శ్రీదేవి, ఉమా రజిత, తదితరులు పాల్గొన్నారు.

'చేయూత'కు విరాళం



లక్ష్మీదేవి అందించిన విరాళాన్ని ఆలీమ్‌కు అందిస్తున్న టేకుమూడి సూర్యనారాయణ

బోట్‌క్లబ్: చేయూత సేవా సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు, విభిన్న సేవా కార్యక్రమాలకు హైదరాబాద్‌కు చెందిన 92 ఏళ్ల వృద్ధురాలు నంబూరు లక్ష్మీదేవి ఆర్థిక సాయం అందించారు. ఆమె అందజేసిన రూ.25 వేలు విరాళం చెక్కును రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యులు టేకుమూడి సూర్యనారాయణ చేయూత సంస్థ ప్రధాన కార్యదర్శి ఆలీమ్‌కు సోమవారం రోటరీ చేయూత భవన్‌లో అందజేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎం.రవికుమార్ మాట్లాడుతూ దాతలు అందించే విరాళాలు సద్వినియోగం చేయడమే కాకుండా, ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని వారిని సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వినికిడి పరీక్షలు చేస్తున్న వైద్యుడు సంతోష్‌కుమార్

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా స్థానిక దేవాలయంవీధిలోని విజయ చెవి ముక్కు గొంతు వైద్యశాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ వైద్య నిపుణుడు సంతోష్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో వినికిడి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఒకరితో ఒకరు సంభాషించడానికి, జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించడానికి వీలు కల్పిస్తుందన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో 95 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా వినికిడి యంత్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, సభ్యులు నిరోషా, సిరాజ్, శ్రీవల్లి పాల్గొన్నారు.

సైన్స్ పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు

బాలాజీచెరువు: పైండా సత్తిరాజు మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం సైన్స్‌పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. వికసిత్ భారత్‌లో విజ్ఞానం, నూతన ఆవిష్కరణలో గ్లోబల్ నాయకత్వానికి భారత యువతను శక్తివంతం చేయడం అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 32 పాఠశాలల నుంచి 218 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వినీల్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాదె విజయంపై హర్షం

బాలాజీచెరువు: ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా మూడోసారి ఎన్నికైన గాదె శ్రీనివాసనాయుడు విజయంపై పీఆర్‌టీయూ జిల్లా శాఖ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో పోరాడుతూ హక్కుల సాధనకు కృషిచేస్తున్న శ్రీనివాసులు నాయుడు విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా అధ్యక్షులు చింతాడ ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బండి నూకరాజు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

నేడు వేలంపాట

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప శివారున ఉన్న నాగులాపల్లి ఏరియా రక్షిత నీటి పథకంలో ఉన్న కొబ్బరి, మామిడి ఫలసాయం వేలంపాటను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవికుమార్ సోమవారం తెలిపారు. నాగులాపల్లి పంచాయతీలో 11.30 గంటలకు ఈ వేలం జరుగుతుందన్నారు. పాటలో పాల్గొనే వారు సాల్వెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. పథకంలో ఉన్న 22 కొబ్బరి చెట్లు, 8 మామిడి చెట్లుకు 31 డిసెంబర్ 2027 వరకు పాట జరుగుతుందని ఆయన తెలిపారు.

భరోసా లేని పాలన!

- ప్రభుత్వ సాయంలేక వీధి వ్యాపారుల అవస్థలు
- వడ్డీ లేని రుణాలు ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- బయటి వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు తెచ్చుకుని అప్పులపాలవుతున్న వైనం
- పాత పథకం కొనసాగించాలని విన్నపం



గాంధీనగర్‌లో రోడ్డు పక్కన పండ్లను విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

బోట్‌క్లబ్: వీధి వ్యాపారులకు గత ప్రభుత్వం ఎంతో అండగా నిలిచింది. వారి పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీలేని రుణం అందించి ఆదుకుంది. దీంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద నుంచి అప్పులు తెచ్చుకుని వారి వేధింపులకు గురయ్యే పరిస్థితి ఉండేది కాదు. అప్పులు సక్రమంగా చెల్లించడంతో బ్యాంకులు సైతం వారికి ఇతర రుణాలు సైతం ఇచ్చేందుకు ముందుకు వచ్చేవి. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచీ వీధి వ్యాపారులకు భరోసా లేకుండా పోయింది. దీంతో ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీలు తెచ్చుకుని నిత్యం వ్యాపారం చేసుకుని వారికి వచ్చిన లాభం అంతా వడ్డీలు కింద పోతుంది. ప్రతి రోజు రూ.500 సంపాదిస్తే దానిలో రూ.300 నుంచి 400 వడ్డీ కింద కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీధి వ్యాపారుల కష్టాన్ని స్వయంగా పాదయాత్రలో చూసి చలించి వారికి వడ్డీ లేకుండా రుణం అందించారు. నగరంలో 8వేల మందికి తగ్గకుండా వీధి వ్యాపారులకు ఏటా రుణాలు అందించారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా వలంటీర్లు సాయంతో వీరికి రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బ్యాంకులు వీరికి ఎటువంటి రుణాలు మంజూరు చేయడం లేదు. బ్యాంకులకు వీధి వ్యాపారులు రుణాలు విషయంతో ఎటువంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో వడ్డీ లేని రుణాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో వీధి వ్యాపారులు ప్రైవేటు వ్యాపారస్తులు వద్ద అప్పులు చేసుకొని వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ పథకాన్ని కొనసాగించాలి

వడ్డీలేని రుణంతో వీధి వ్యాపారులకు ఈ పథకం ఎంతో అండగా నిలిచింది. అటువంటి పథకాన్ని ఈ ప్రభుత్వమూ కొనసాగించాలని వీధివ్యాపారులు కోరుతున్నారు. ఈ పథకం వల్ల ఎందరో చిరు వ్యాపారుల కుటుంబాలు లబ్ధి పొందాయి. అటువంటి పథకం ప్రస్తుతం నీలినీడలు కమ్ముకోవడంతో ఆ వ్యాపారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో 8 వేల మందికి లబ్ధి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీధి వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు అందించేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కాకినాడ నగరంలో 8 వేల మందికి పైగా లబ్ధి పొందారు. వ్యాపారులు సక్రమంగా రుణాలు చెల్లిస్తే మళ్లీ వారికి బ్యాంకులు రుణాలు రెన్యువల్ చేసేవారు. ఆ వడ్డీని ప్రభుత్వం భరించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీ లేని రుణాల మాట మర్చిపోవడంతో వాటి కోసం వీధి వ్యాపారులు ఎదురుచూపులు చూస్తున్నారు. మళ్లీ ఈ పథకాన్ని కొనసాగించాలని కోరుకొంటున్నారు.

రుణం అండగా నిలిచింది



గత ప్రభుత్వమే అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో ఆసరాగా ఉండేది. ఇచ్చిన రుణంలో పండ్లు కొనుగోలు చేసుకుని ప్రతీ రోజు విక్రయించడంతో వచ్చిన డబ్బులు ఇంటికి తీసుకు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం బ్యాంకుల్లో వడ్డీ లేని రుణాలు ఇవ్వడం లేదు. దీంతో బయట వ్యాపారస్తులు వద్ద అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ పథకాన్ని కొనసాగించాలి

దుగ్గన వెంకన్న, కొబ్బరి బొండాల వ్యాపారి

ప్రభుత్వం ఆదుకోవాలి



వీధి వ్యాపారులను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వ హయాంలో వీధి వ్యాపారులకు వలంటీర్లు రుణాలు ఇప్పించేవారు. ప్రస్తుతం ఈ పథకం లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. వడ్డీ లేని రుణాలు కొనసాగిస్తే మా కుటుంబానికి అండగా ఉంటుంది.

చాట్ల శ్రీనివాస్‌రెడ్డి, అరటిపండ్ల వ్యాపారి

అన్ని రంగాలలో మహిళలు విజయం

ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి



వివిధ రంగాల మహిళలకు సన్మానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: అన్ని రంగాలలో మహిళలు విజయవంతంగా ముందుకు సాగుతున్నారని ఐసీడీఎస్ సీడీపీఓ వై.లక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో సీడీపీఓ లక్ష్మి, సచివాలయ ఉద్యోగిని శిరీష, వైద్యురాలు వరలక్ష్మి, పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి లను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ ఒక నాడు వంటింటికి పరిమితమైన మహిళ నేడు సమున్నత స్థాయికి చేరుకుందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, ప్రసాద్ నాయుడు, కృష్ణమోహన్, శిరీష, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

- నరుకు నిల్వల్లో తేడాల గుర్తింపు
- 6ఏ కేసులు నమోదు



వాకలపూడిలో రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట, వాకలపూడి, తిమ్మాపురం, రాయుడుపాలెం, ఎస్.అచ్యుతాపురం గ్రామాల పరిధిలో ఐదు రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేశారు. రెండు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేసినట్టు ఎంఎస్ఓ మమత తెలిపారు. రమణయ్యపేటలో షాప్ నంబరు 45లో బియ్యం 7070 కేజీలు అధికంగాను, పంచదార 68.5 కేజీలు తక్కువగా, కందిపప్పు 100 కేజీలు అధికంగా ఉన్నట్టు గుర్తించి డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. కొందరు వేలి ముద్రలు వేసేందుకు సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆర్వో ద్వారా సరుకులు అందించినట్టు డీలర్ అధికారులకు తెలియజేశారన్నారు. వాకలపూడిలో షాప్ నంబరు 55లో 317 కేజీల తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మైత్రేయి సేవలు మరువలేనివి



ఐపీఎస్ అధికారి కుమారి సుష్మితా రామనాథన్‌ను సన్మానిస్తున్న మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మైత్రేయి ప్రూటీకుమార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ 8వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏటా ఇచ్చే అవార్డులను ఐపీఎస్ అధికారి కుమారి సుష్మితా రామనాథన్‌కు, డాక్టర్ రత్నదీప్తికి, కామూరి ధనూషా, భమిడి గిరిజాదేవికి మైత్రేయి సావిత్రిబా యిపూలే అవార్డులు, వైద్యులు లావణ్య, కావూరి రోష్నిలకు మైత్రేయి యూత్‌స్టార్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రాణాంతరక వ్యాధిగ్రస్తులైన 100 మంది చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, వారికి పౌష్టికాహారం అందించారు. సంస్థ కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ తాను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 800 మంది ప్రాణాంకర వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు చెప్పారు. దశలవారీగా వారికి తమ సంస్థ తరపున పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరావు, వి.సత్యప్రసాద్, పృథ్వీచరణ్, డాక్టర్ రమాదేవి , గీత, అపర్ణ పాల్గొన్నారు.

అశ్శరభ శరభ..



సర్పవరం గ్రామంలో వీరభద్రులను తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: వీరభద్రుడిని గద్దెకు అప్పగించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సర్పవరం గ్రామం సోమవారం సందడిగా మారింది. శరభ.. శరభ అంటూ భక్తులు తలపై వీరభద్రులను ధరించి ఊరేగి గ్రామంలోని ఒక ఇంటి వద్ద గద్దెకు అప్పగించారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

సామర్లకోట: స్థానిక పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలలో ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఇప్పటి వరకు కాకినాడ సెంటర్‌గా ఉండగా, విద్యార్థుల వినతుల మేరకు సామర్లకోటలో మూడు పరీక్షా కేంద్రాలను కేటాయించారు. పట్టణంలో 781 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 747 మంది పరీక్షలు రాసారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 297 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 278 మంది, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 168 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 163 మంది, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 316 మందికి 306 మంది పరీక్షలు రాసినట్లు ఆయా పాఠశాలల ఇన్‌చార్జిలు తెలిపారు.

పనులు సకాలంలో పూర్తి చేయండి

జిల్లా ఆస్పత్రుల్లో పనుల ప్రగతిపై కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రులలో జరుగుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసుపత్రి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాకినాడ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులలో జరుగుతున్న నాబార్డ్, ఇతర సివిల్ వర్క్స్‌పై కలెక్టర్ ఏపీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాకినాడ జిల్లా పరిధిలోని ఆస్పత్రుల మెడికల్ సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్ ఇన్ చార్జిలతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రతి ఆస్పత్రిలో ఏయే పనులు మంజూరయ్యాయి. ఎంత వరకు పూర్తయ్యాయి. ఎప్పటికి పూర్తవుతాయి, వాటి ప్రస్తుత స్థితి గతులు, పూర్తి అయినవి ఆస్పత్రులకు అప్పగించారా లేదా తదితర విషయాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. మళ్లీ దీని గురించి రెండు వారాల తరువాత సమీక్షిస్తానన్నారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ రత్నరాజు, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ ఎస్.స్వప్న, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్, కాకినాడ జిల్లా పరిధిలోని ఆసుపత్రుల మెడికల్ సూపరింటిండెంట్లు, మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



బాల్య వివాహాలు చేయబోమని ఆడపిల్లల తల్లులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి

బోట్‌క్లబ్: మహిళల చట్టాలపై అవగాహన పెంచుకుని సమాజంలో జరుగుతున్న నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి అన్నారు. స్థానిక ఏటిమొగలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు రాణిస్తున్నారని, బాల్య వివాహాలు నిర్మూలనకు సంతకాలు సేకరించారు. అనంతరం మహిళలతో బాల్య వివాహాలు చేయబోమని, బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో మొక్కలు నాటాలని సిబ్బంది ప్రభావతి సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది నూకరత్నం, సుజాత, అన్నపూర్ణ, సత్యకుమారి, దయావతి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

బాలికలను కాపాడుకుందాం



సర్పవరం జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో బాలికల రక్షణ కోరుతూ సర్పవరం జంక్షన్‌లో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాలికను రక్షిద్దాం - బాలికను చదివిద్దాం (బేటీ బచావో - బేటీ పడావో) అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పవరం ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలను చదివించడం ద్వారా మగవారితో పాటు వారు అన్ని రంగాలలో ముందంజలో ఉంటారన్నారు.

ఆధ్యాత్మికతతో సేవా గుణం

- దాతల సహకారంతో రామాలయ నిర్మాణం అభినందనీయం
- దవులూరి దొరబాబు



గొంచాల గ్రామంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం పెంపొందించుకోవడం ద్వారా ఇతరులకు సేవ చేయాలనే ఆలోచన కలుగుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండల పరిధిలో గొంచాల గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన రామాలయంలో సోమవారం విగ్రహాల ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. గత 14 ఏళ్లుగా గొంచాల గ్రామం నుంచి భక్తులు భద్రాచలానికి పాద యాత్రగా వెళ్లడం అభినందనీయమన్నారు. దాతల సహకారంతో టేకు కర్రతో రథం తయారు చేయడంతో పాటు భద్రాద్రి రామాలయ నిర్మాణం జరగడంతో ప్రజల్లో భక్తి భాగం పెరిగిందన్నారు. గురుస్వామి వుంగరాల వీరవెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు వింటి బాబ్జి, అధ్యక్షుడు పేర్నీడి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి యేలూరి శ్రీనివాసు, కోశాధికారి బావిశెట్టి వెంకటసత్యప్రసాద్, మండల పరిషత్ వైస్ ఎంపీపీ పేర్నిడి వెంకట్రాయుడు, సర్పంచ్ చోడిశెట్టి వెంకటరమణ, వైస్ ప్రెసిండెంట్ ముమ్మిడి శివశంకర ప్రసాద్, వైఎస్సార్ సీపీ అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీ నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, పార్టీ నాయకులు కర్రి వెంకటసుబ్బారావు, అముజాల సూర్యనారాయణ తదితరులు భక్తులకు సేవలందించారు. అనంతరం సీతారాముల కల్యాణం, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో లక్ష్యాలు పూర్తి చేయాలి



కరపలో గ్రామ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామ పంచాయతీలకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని మండల ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. ఇంటి పన్నులు, పన్నేతర వసూళ్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ సర్వే త్వరితగతిన నిర్వహించాలన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడి విడిగా సేకరించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు వస్తారని, ఈ నెల 20వ తేదీ లోగా లక్ష్యాలను పూర్తిచేయాలని ఈఓపీఆర్డీ గ్రామకార్యదర్శులకు సూచించారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు



వేళంగి కళాశాలలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో సోమవారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభంకాగా తెలుగు పేపర్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. వేళంగి పరీక్షా కేంద్రంలో 99 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరై 96 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు, డిపార్టమెంటల్ ఆఫీసర్ జె.డానియల్ ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్ సిబ్బందితో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఎస్సై టి.సునీత బందోబస్తు నిర్వహించారు.

కంటి చూపుపై శ్రద్ధ చూపాలి

ఎంఈఓ శివరామకృష్ణయ్య



విద్యార్థినులకు కంటి అద్దాలు అందజేసిన ఎంఈఓ, హెచ్ఎం

సామర్లకోట: విద్యార్థులు కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. విద్యార్థుల సంరక్షణ పోషణ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కంటి పరీక్షలు చేసుకున్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టీవీ, సెల్ ఫోన్లు చూడటం తగ్గించుకోవాలన్నారు. దీనికి తోడు ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కంటి చూపుపై జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ప్రతి పాఠశాలలోను కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు 45 కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యు.మీనామాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.